# కానరాని పల్లె వెలుగు

- లాభార్జనే లక్ష్యంగా సర్వీసుల మార్పు
- దీంతో ఇబ్బందులు పడుతున్న పల్లె ప్రజలు
- గురజాల నియోజకవర్గంలో 14 గ్రామాలకు వెళ్లని ఆర్టీసీ బస్సు
- ఆటోలు, సొంత వాహనాలే దిక్కు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు



పిడుగురాళ్ల బస్టాండ్ (ఇన్‌సెట్) పల్లెవెలుగు బస్సు

పిడుగురాళ్ల: పల్లెలకు ఆర్టీసీ సేవలు అందకపోవటంతో ఆటోలను ఆశ్రయిస్తూ పలువురు ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్టీసీ యాజమాన్యం గతంలో ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు పల్లె వెలుగు పేరిట బస్సులను నడిపేది. కానీ నేడు లాభార్జనే లక్ష్యంగా ఆర్టీసీ బస్సులను తిప్పుతున్నారు. పల్లెల్లో ఆర్టీసీ బస్సులు తిప్పుతుంటే నష్టం వస్తుందన్న కారణంతో పల్లెలకు బస్సులు ఏర్పాటు చేయటం లేదు. పల్లె వెలుగు బస్సులను ఏ రూట్లో ఆదాయం ఎక్కువ వస్తుందో ఆ రూట్లకు మళ్లిస్తున్నారు. దీంతో గ్రామాలలోని ప్రజలు ఆటోలు, ట్రాలీ ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతున్నారు. అదే బస్సు సౌకర్యం ఉంటే ప్రజలు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుతారు. ప్రైవేటు వాహనాలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణిస్తుండటంతో మూలమలుపుల వద్ద, ఓవర్ టేక్ చేసే సమయంలో ఇలా పలు సంఘటనల్లో ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలను కోల్పోతున్నారు.

**పిడుగురాళ్ల డిపో నుంచి 56 బస్సు సర్వీసులు**

పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి 56 బస్సు సర్వీసులు నిత్యం తిరుగుతున్నాయి. ఇవన్నీ ఎక్కువగా పిడుగురాళ్ల పట్టణం నుంచి గుంటూరు, విజయవాడ, మాచర్ల, దాచేపల్లి, వినుకొండ, నరసరావుపేట, క్రోసూరు, కారంపూడి ప్రధాన రహదారుల నుంచే ఆర్టీసీ సర్వీసులు ప్రజలకు అందుతున్నాయి. ప్రధాన రహదారుల నుంచే ఉండటం వలన పల్లెటూళ్లకు ఆర్టీసీ సర్వీసులు అందకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- గురజాల మండలంలో పల్లె గుంత, మాడుగుల గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- దాచేపల్లి మండలంలో కాట్రపాడు, భట్రుపాలెం, మాదినపాడు, అగ్రహారం, కొత్తూరు, రామాపురం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- పిడుగురాళ్ల మండలంలో కరాలపాడు, చిన్న అగ్రహారం, పెద అగ్రహారం, చెన్నాయిపాలెం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- మాచవరం మండలంలో శ్రీరుక్మిణీపురం, పిన్నెల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు.

**14 గ్రామాలకు ఆటోలే ఆధారం**

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో మొత్తం 14 గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవటంతో ప్రజలు ఆటోలపైనే ఆధారపడి ప్రయాణించాల్సిన పరిస్థితి. లేదా సొంత వాహనాలపై ప్రయాణించుతూ అప్పుడప్పుడు కొంత మంది ప్రమాదాలకు గురవుతున్నారు.


పిడుగురాళ్ల నుంచి ఆటోల్లో ప్రమాదకరంగా ఇలా ప్రయాణం

### బస్సు సౌకర్యం కల్పించండి


మా ఊరికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవటంతో నిత్యం పిడుగురాళ్ల పట్టణానికి రావాలంటే ఆటోలే మాకు దిక్కు అయ్యాయి. మండల కేంద్రమైన మాచవరానికి ప్రభుత్వ సేవల కోసం వెళ్లాలన్నా ప్రత్యేకంగా ఆటో మాట్లాడుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మాకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తే రుక్మిణీపురం తండా, శ్రీరుక్మిణీపురం తండా ప్రజలకు ప్రయాణ ఇబ్బందులు తొలగుతాయి.

– మొదడుగు కృష్ణ, శ్రీరుక్మిణీపురం, మాచవరం మండలం

### ఇబ్బందులు పడుతున్నాం


మా గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. నష్టాలు వస్తున్నాయన్న కారణంతో బస్సు సౌకర్యం ఎత్తి వేశారు. దీంతో బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి మా ఇబ్బందులును పరిష్కరించాలి.

– భూమిరెడ్డి యల్లారెడ్డి, కరాలపాడు, పిడుగురాళ్ల మండలం

### ఆయిల్ ఖర్చులు కూడా రావటం లేదు


పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి 56 ఆర్టీసీ సర్వీసులు తిరుగుతున్నాయి. కొన్ని పల్లెలకు తిప్పలేని పరిస్థితి ఉంది. కారంపూడి, దాచేపల్లి, క్రోసూరు వైపు వెళ్లే బస్సులకు ఆయిల్ ఖర్చులు కూడా రావటం లేదు. విద్యార్థుల సౌకర్యం కోసం తిప్పుతున్నాం. ప్రజలు కూడా ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూడకుండా ఆటోలు ఎక్కుతున్నారు.

– డి.కోటేశ్వర నాయక్, ఆర్టీసీ డిపో మేనేజర్, పిడుగురాళ్ల

## క్లుప్తంగా

### పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పిడుగురాళ్ల: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉదయం పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వ్యాపారస్తులు రోడ్డుపై చెత్త వేయవద్దని ఎన్ని సార్లు చెప్పిన వినటం లేదని, మున్సిపాలిటీ సిబ్బంది వచ్చినప్పుడు చెత్తను ఇవ్వని వారికి జరిమానా విధించాల్సి వస్తుందన్నారు. అదేవిధంగా కల్యాణ మండపాలలో వివాహాలు, శుభకార్యాలు చేసుకున్న వస్తువులను రోడ్లపై వేయకుండా నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి



మాచవరం: పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండలంలోని కొత్త గణేశునిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో వరి పంట సాగు చేయనున్న రైతులు ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామానికి చెందిన బూసి ప్రసాద్ వరి పొలంలో పంట కోత ప్రయోగం చేపట్టారు. 25 చదరపు మీటర్ల వెడల్పులో నూర్పిడి చేయగా 13.550 కి.గ్రా. దిగుబడి రాగా, ఎకరాకు 21.81 క్వింటాళ్లు, అంబటి పాపయ్య వరి పొలంలో 14.250 కి.గ్రా. దిగుబడికి హెక్టారుకు 57.350 క్వింటాళ్లుగా అంచనా వేశారు.

### సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి

గురజాల : సమస్యను త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. దాచేపల్లి మండలంలోని కేసానుపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో సైడు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో అర్జీ దాఖలు చేయగా సదరు విషయంపై గ్రామంలో పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడి సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని డ్వామా పీడీ అన్నారు. ఆయనతో పాటు ఏపీడీ మల్లిఖార్జునరావు, పంచాయతీ అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

### అయప్పస్వామి మండపంలో హోమాలు



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవా సమితి మండపంలో శుక్రవారం వేద పండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో భక్తి శ్రద్ధలతో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెంటచింతలకు చెందిన తంగిరాల శ్రీనివాసరెడ్డి, పాల్వాయి కొండలు 380 మంది స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరెడ్డి స్వామి, పటాల సుబ్బారావు గురుస్వామి, కట్టమూరి శ్రీను గురుస్వామి, బరువు శివారెడ్డి, కె.సైదులు స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాలధారులకు డిసెంబర్ 26 వరకు దాతల సహకారంతో అన్నదానం చేయనున్నట్లు అయ్య ప్ప సేవా సమితి కమిటీ సభ్యులు తెలిపారు.

### నిందితులను అరెస్ట్ చేయాలి

క్రోసూరు: మండలంలోని ఊటుకూరు గ్రామంలో గత బుధవారం మాదిగ పల్లె మీద మైనార్టీలు దాడి చేయడాన్ని ఎమ్మెర్పీఎస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడులు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని పేర్కొన్నారు. చిల్కా గోపిపై ఇంటిలోకి దూరి నిర్దాక్షణ్యంగా రాడ్లు, కత్తులతో చేయడం సరికాదని తెలిపారు. దోషులను అరెస్ట్ చేయకపోతే నియోజకవర్గ స్థాయిలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## బోళా లింగేశ్వరునికి ప్రత్యేక పూజలు


బోళా లింగేశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న బోళా లింగేశ్వరస్వామి ఆలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా, కార్తిక మాసం మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పుణ్య దంపతులతో హోమం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. అలాగే హాజరైన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

## నేడు కౌన్సిల్ సమావేశం

గురజాల : దాచేపల్లి నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ తెలిపారు. సాధారణ సమావేశాల్లో భాగంగా ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించడం జరుగుతుందని కౌన్సిలర్లందరూ హాజరుకావాలని కోరారు.

## ముగిసిన ప్రజా వేదిక


మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

గురజాల : స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై ఏర్పాటు చేసిన ప్రజా వేదిక ముగిసింది. డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి ఆధ్వర్యంలో గ్రామల్లో డీఆర్పీలు సేకరించిన వివరాలను చదివి వినిపించారు. మండలంలోని 13 గ్రామాల్లో 171 పనులకు గాను రూ.6,07,61,268 నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.13 గ్రామాలలో 8 మంది డీఆర్పీలు విచారణ చేశారు. విచారణలో చేసిన పనులకు అక్కడక్కడ బోర్డులు ఏర్పాటు చేయలేదని, ఉపాధి హామీ నిధులతో రైతులకు ఇచ్చిన మొక్కలు ఎండిపోయాయని, వేలిముద్రలు వేసి నిశాని అని రాయలేదని, రశీదులు ఇవ్వలేదని తదితర విషయాలు డీఆర్పీలు సూచించారు. వంద రోజుల పనిదినాలు కూలీలకు వంద శాతం ఎందుకు కల్పించలేకపోయారని పీడీ సిద్ధలింగమూర్తి ఫీల్డ్ అసిస్టెంట్‌లను ప్రశ్నించారు. కూలీలకు వంద రోజుల పనిని కల్పించడమే ఈ పథకం లక్ష్యం అని పీడీ అన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు డ్వామా అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి విజయ, ఎంపీపీ వేముల శేషమ్మ, ఎంపీడీవో షేక్ గౌసియా బేగం, ఏపీడీ కె.మల్లిఖార్జునరావు, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, ఏపీవో పద్మజ తదితరులున్నారు.

## విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవాలి



మాచర్ల: ప్రతి విద్యార్థి ఇష్టంగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు ఆడాలని, ఉన్నతంగా ఎదగాలంటే చదువు పట్ల శ్రద్ధ ఉండాలన్నారు. స్వామి వివేకానంద సేవా సమితి 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి కాలేజీలో 'భరత జాతికి నా హితవు' పుస్తకం ఆధారంగా విద్యార్థలకు జాగృతి పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ డి.వేణు బాబు హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించుకోవాలని, జాగృతి పోటీలు నిర్వహించటం ఆనందకరమన్నారు. విద్యార్థులలో మేధాశక్తి పెరగాలంటే పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ బాలయ్య మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగి భవిష్యత్తులో పేదలకు, సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చంద్రారావు, లెక్చరర్ దుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో పిడుగురాళ్ల విద్యార్థుల ప్రతిభ


సీనియర్ విభాగంలో స్కాలర్స్ స్కూల్ విద్యార్థులు


జూనియర్ విభాగంలో తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు

పిడుగురాళ్ల: గుంటూరులోని లోటస్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పిడుగురాళ్ల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచిన స్కాలర్స్ స్కూల్ విద్యార్థులను కళాశాల చైర్మన్ జి.పిచ్చిరెడ్డి, డైరెక్టర్స్ జి.శ్రీనివాసరెడ్డి, ఎం.జగదీష్‌రెడ్డిలు, పీఈటీ సాంబిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా జూనియర్ విభాగంలో మొదటి స్థానం సాధించిన తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులను డైరెక్టర్ బొల్ల గిరిబాబు, ప్రిన్సిపల్ పి.నరేష్, పీఈటీ నాగరాజులు అభినందించారు.

## జాబ్ మేళాలో 79 మంది ఎంపిక



పిడుగురాళ్ల: పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 79 మంది ఎంపికైనట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో మొత్తం 4 కంపెనీలు పాల్గొనగా 101 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. వారిలో 79 మందిని ఎంపిక చేయటం జరిగిందని తెలిపారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జి.వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళా ద్వారా పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించటం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్, ఆర్.కిరణ్‌నాయక్, ఇ.రామకృష్ణరెడ్డి, మహిధర్, మస్తాన్, కంపెనీ ప్రతినిధులు, సీడాప్ జిల్లా ఉద్యోగ కల్పన అధికారి నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

### సంగం బజార్‌లో చైన్ స్నాచింగ్

సత్తెనపల్లి: పట్టణంలోని సంగం బజార్‌లో శుక్రవారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. వివరాల మేరకు.. పట్టణంలోని సంగం బజార్‌లో రేవతి గోపాలరావు వృద్ధుడు తన ఇంట్లో కూర్చుని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి, అతని మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్ బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. వృద్ధుడు కేకలు పెట్టడంతో స్థానికులు అక్కడికి రావడం జరిగిన విషయాన్ని చెప్పాడు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టారు.

### ఆత్మహత్య చేసుకున్న మహిళ వివరాలు లభ్యం

అమరావతి: స్థానిక హిందూ శ్మశాన వాటిక సమీపంలో గురువారం ఆత్మహత్య చేసుకున్న మహిళను సత్తెనపల్లికి చెందిన జంపాల లీలావతి(49)గా గుర్తించారు. సీఐ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. జంపాల వెంకటరమణయ్య భార్య లీలావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. లీలావతికి మానసిక స్థితి బాగోలేనందువల్ల గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం లీలావతి మృతదేహన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

### చట్టాలపై అవగాహన అవసరం

చిలకలూరిపేట టౌన్: తల్లిదండ్రులు, గురువులు సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంఈఓ కె.లక్ష్మి తెలిపారు. చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం బాల్య వివాహ రహిత ముక్త్ భారత్ కార్యక్రమం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలబాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎంఈఓ బాలల హక్కులపై ప్రసంగించారు.

## పట్టణంలోని అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండాలి

మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు



మాచర్ల: పట్టణంలోని అన్ని వార్డులలో మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ డి.వేణు బాబులు అన్నారు. శుక్రవారం వారు 10, 11,12 వార్డులలో పర్యటించి ఎక్కడా చెత్త, మురుగు కాల్వల్లో చెత్త, మురుగు లేకుండా చూడాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. వారు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమం చేయాలని ఆదేశించారని, ఆయన ఆదేశాల మేరకు పట్టణంలో ప్రతి రోజూ వార్డులలో తిరిగి అన్ని ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. అదే విధంగా ప్రధాన వీధులలో చెత్తను రోడ్డుపై వేయకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం, ప్లాస్టిక్ కప్పుల వినియోగం స్వచ్ఛందంగా ఆపాలన్నారు.

## 'ఉక్కు సత్యాగ్రహం'.. మంచి సినిమా



మాచర్ల: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో తెరకెక్కిన ఉక్కు సత్యాగ్రహం సినిమా శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైనట్లు దర్శకుడు, నిర్మాత, హీరో పి.సత్యారెడ్డి తెలిపారు. జనం ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో వచ్చిన ఉక్కు సత్యాగ్రహం సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. పాటల రచయితగా వేముల శ్రీను ఉన్నారన్నారు. రిటైర్డ్ డీఈఓ గాదె రామకృష్ణారావు, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి సినిమా చూసి ప్రశంసించారు. సత్యారెడ్డి మాట్లాడుతూ మొదటి నుంచి ప్రజల్లో చైతన్యం కలిగించే సినిమాలు తీస్తున్నానన్నారు. సినిమాలో ప్రతి పాత్రలో ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో రాణించారన్నారు. మంచి సినిమాలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తారన్నారు. మన ప్రాంత వాసులు నిర్మించిన సినిమాను ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలన్నారు.

## పక్కాగా పశు గణన


పశు గణన సర్వే చేస్తున్న సిబ్బంది

గురజాల : గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ రంగంలో పశువులు కీలక భాగం. వాటిని లెక్కించడం ద్వారా పాడి సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలుంటుంది. దీనిలో భాగంగా నవంబర్ 1 నుంచి జాతీయ స్థాయిలో పశుగణనను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 2025 ఫిబ్రవరి నాటికి గణన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం పశుసంవర్ధక శాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పాడి పశువులు, పక్షుల వివరాలను లెక్కించే పనిలో నిమగ్నమయ్యారు. పశుగణనలో భాగంగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు బాతులు.. ఇలా 16 రకాల జంతువులు, పక్షులను లెక్కిస్తారు. దీనిపై ఇప్పటికే పశుగణన సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అయితే ఈ పశుపక్ష్యాదుల వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఆ వివరాలను సూపర్‌వైజర్లు, జిల్లా స్థాయి అధికారులు పరిశీలిస్తారు. నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల పరిధిలో సుమారు1.50 లక్షలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. మండలాల పరిధిలోని గ్రామాల్లో పశుగణన సర్వే చురుగ్గా సాగుతోంది.

### పాడి రైతులకు ఉపయోగం


పాడి రైతుల సంక్షేమానికి పశు గణన ఎంతో అవసరం. పశువులకు ఆహార భద్రత కల్పించడంలోనూ సంక్రమణ వ్యాధులను నివారించడానికి జీవనోపాధి కల్పించడంలోనూ పశుగణన ఎంతో ఉపయోగపడుతుంది. పక్కాగా పశుగణన లెక్కింపునకు కృషి చేస్తున్నాం.

– పశువైద్యాధికారిణి ఉమా మహేశ్వరి, దైద

### వరి గడ్డికి గిరాకీ



క్రోసూరు: వరి గడ్డికి గిరాకీ పెరిగింది. వరి కోతలు ఊపందు కోవడంతో క్రోసూరులో మోపు రూ.180కు విక్రయిస్తున్నారు. నకరికల్లు మండలంలోని గుళ్లపల్లి నుంచి ట్రాక్టర్‌పై తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు లోడు రూ.15వేలుగా నిర్ణయించారు. 80 నుంచి 110 వరకు వరి గడ్డి మోపులు ఉంటాయని విక్రేతలు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో ముమ్మరంగా వరిసాగు జరిగిందని, జనవరిలో కోతలు పూర్తిచేసుకుంటాయని, అప్పుడు గడ్డి ధర తగ్గొచ్చని చెబుతున్నారు.